

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 25-05-2025 | సంపుటి - 24 | సంచిక - 23 | రూ : 4 | పేజీలు: 8


## శునకాలు..
# క్యాన్సర్ పసిగట్టేస్తాయ్!



- బెంగళూరుకు చెందిన అంకుర సంస్థ కృషి ఫలితం
- ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో వ్యాధి నిర్ధారణ
- కర్ణాటకలో 6 ఆసుపత్రుల్లో అందుబాటులో పరీక్షలు

**మే 24, బెంగళూరు:** వాసనతోనే బాంబులు, మాదకద్రవ్యాలను పసిగట్టే సామర్థ్యం శునకాల సొంతం. ఈ సామర్థ్యాన్నే వైద్యరంగం అందిపుచ్చుకుంటోంది. వాటి ఆఘ్రాణశక్తితో 28 రకాల వ్యాధులను గుర్తించగలవని ఇప్పటికే వైద్య అధ్యయనాలు నిరూపించాయి. దీంతో బెంగళూరుకు చెందిన 'డాగ్‌నోసిస్' అనే అంకుర సంస్థ 98% కచ్చితత్వంతో క్యాన్సర్లనూ గుర్తించేలా శునకాలకు శిక్షణ ఇస్తోంది. మనిషి శ్వాసను బట్టి క్యాన్సర్ ఉందా? లేదా? అని తేల్చే మల్టీ క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్ (ఎంసీఈడీ) అనే విధానాన్ని ఆ సంస్థ నిపుణులు కనుగొన్నారు. ఇందులో బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)డాగ్‌సెన్స్ అనే పరికరం, 'డాగోస్' అనే సాఫ్ట్‌వేర్, న్యూ మెషీన్ లెర్నింగ్ **తరువాయి 2లో**



## సీఎం పదవికి
### రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

- ఈడీ ఛార్జిషీట్‌లో ఆయన పేరు ఉండడం రాష్ట్రానికే అవమానం
- గవర్నర్‌ను కలిసి ప్రాసిక్యూట్ చేయాలని అడుగుతాం: కేటీఆర్
- పార్టీ విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలని వ్యాఖ్య

**మే 24, హైదరాబాద్:** నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసుతో సంబంధమున్న 'యంగ్ ఇండియన్' కంపెనీ నిధుల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీట్ నమోదు చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు

**తరువాయి 2లో**

# ముందే పలకరించిన 'నైరుతి'

- కేరళను తాకిన రుతుపవనాలు
- రాష్ట్రానికి భారీ వర్ష సూచన

**మే 24, విశాఖపట్నం:** రైతులకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లని కబురు అందించింది. వ్యవసాయానికి ఊతమిచ్చే నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఎనిమిది రోజుల ముందే కేరళను తాకినట్లు ప్రకటించింది. ఇదే సమయంలో లక్షద్వీప్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, మిజోరం రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకూ రుతుపవనాలు విస్తరించాయి. కేరళలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ గాలులు, అవుట్ గోయింగ్ లాంగ్‌వేవ్ రేడియేషన్ (ఓఎల్ఆర్) తదితరాలను పరిగణనలోకి తీసుకుని నైరుతి ప్రవేశించినట్లు ఐఎండీ ప్రకటించింది. ఈసారి నైరుతిలో సాధారణంకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది.

**తరువాయి 2లో**



## అందాల పోటీల నుంచి
# వైదొలగిన మిస్ ఇంగ్లాండ్



- ఇవేం పోటీలంటూ నిర్వాహకులపై సంచలన ఆరోపణలు
- పురుష స్పాన్సర్ల ముందు కోతుల మాదిరి ఆడిస్తున్నారని వ్యాఖ్యలు
- బ్రిటిష్ మీడియా కథనాలను ఖండించిన మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఉర్రూతలూగించిన అందగత్తెలు

హైదరాబాద్: 'హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా' అంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణపై గౌరవం పెరిగిందని, అతిథ్యం బాగుందని మెచ్చుకుంటూనే మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలని

**తరువాయి 2లో**

## రేషన్ తీసుకోవడం లేదు..
# కార్డుదారులేమయ్యారు?

- సన్నబియ్యానికి ముందుకు రాని వారు 1,62,773 మంది
- జిల్లాల వారీగా కొనసాగుతున్న విచారణ
- ఇప్పటికే 6 వేలకు పైగా కార్డులు అనర్హమైనవిగా గుర్తింపు




**2లో**

## ప్రభుత్వమంటే మీకు కృతజ్ఞత లేదా?

- ఇక వ్యక్తిగత చర్చలకు తావు లేదు
- సమగ్ర విధానంతో సినీ పరిశ్రమ అభివృద్ధి
- ఎక్కువ మందికి అవకాశం కల్పిస్తేనే మేలు
- సంబంధిత విభాగాలతోనే చర్చలు
- సినిమా హాళ్లలో సౌకర్యాలపై దృష్టి
- రిటర్న్ గిఫ్ట్‌కు ధన్యవాదాలు
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయం ప్రకటన

**2లో**





## తెలంగాణ రైజింగ్‌కు
# ఎన్ని నిధులైనా ఇస్తాం

- రాష్ట్రంలో సంక్షేమం, సుపరిపాలనకు ప్రాధాన్యం ఇస్తున్నాం

2028కి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

హైదరాబాద్‌ను 'డేటా సెంటర్ హబ్'గా మారుస్తాం

వికసిత భారత్ లక్ష్యాల సాధనకే 'తెలంగాణ రైజింగ్-2047' విజన్

నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**2లో**

## పాలిసెట్‌లో
# 81.88% మంది పాస్

- టాపర్లలో అమ్మాయిలే అధికం
- ఈసారి కొత్తగా రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

**మే 24, హైదరాబాద్:** హైదరాబాద్: పాలిసెట్‌లో 81.88 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 98,858 మంది పరీక్ష రాయగా వారిలో 80,949 మంది కనీస మార్కులు సాధించి కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు. పాలిసెట్ 2025 ఫలితాలను శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బీటెట్) కార్యదర్శి బి.శ్రీనివాస్ తదితరులు విడుదల చేశారు. ఎంపీసీ విభాగంలో 80,949

**తరువాయి 2లో**



# తెలంగాణ రైజింగ్‌కు చేయూతనివ్వండి

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి 'తెలంగాణ రైజింగ్' పేరుతో తాము చేపట్టిన కార్యక్రమాలకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మనదేశం రాష్ట్రాల సమాఖ్య అని... కేంద్రం సహాయ, సహకారాలు లేకుండా రాష్ట్రాల ప్రగతి సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమం, సమగ్ర నూతన విధానాల రూపకల్పన, అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక, సుపరిపాలన లక్ష్యాల సాధనకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు. వికసిత భారత్ లక్ష్యసాధనలో తెలంగాణ మొదటి వరుసలో నిలుస్తుందని మాట ఇస్తున్నామన్నారు. శనివారం దిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ''సంక్షేమం, సుపరిపాలనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. 2047 నాటికి మన దేశాన్ని సూపర్‌పవర్‌గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పం స్వాగతించదగింది. కేంద్ర ప్రభుత్వ 'వికసిత భారత్' ప్రణాళిక అభినందనీయం. అదే స్ఫూర్తితో మేం 'తెలంగాణ రైజింగ్ 2047' పేరిట విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం'' అని వెల్లడించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే... ''మన దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఆర్థిక, పాలనాపరమైన ప్రాధాన్యాలపై చర్చించేందుకు ఇక్కడ సమావేశమయ్యాం. ఈ రోజు మనం చేసే చర్చలు దేశ అభివృద్ధి, సంక్షేమంపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయి. మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధిలో 2047 నాటికి హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాల సరసన నిలబెట్టాలనే లక్ష్యంతో తొలి అడుగుగా గత ఏడాదిన్నర కాలంలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్‌లలో పర్యటించి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించాం. మెట్రో విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టులు ప్రస్తుతం ప్రణాళిక దశలో ఉన్నాయి. హైదరాబాద్‌ను డేటా సెంటర్ల హబ్‌గా మారుస్తాం. విద్య, వైద్యంలో నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం.

*** ఉగ్రవాదంపై పోరుకు సంపూర్ణ మద్దతు**

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించినందుకు ప్రధాని మోదీకి, సైన్యానికి అభినందనలు. ఉగ్రవాదంపై పోరులో భాగంగా సాయుధ దళాలు చేపట్టే ప్రతీ చర్యకు మా సంపూర్ణ మద్దతు ఉంటుంది. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో దేశానికి చిరస్మరణీయ విజయం అందించిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దృఢ నాయకత్వాన్ని ఈ సమయంలో గుర్తు చేసుకోవడం సముచితం.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**

ట్రిలియన్ డాలర్ల 'స్థూల జాతీయోత్పత్తి'(జీఎస్‌డీపీ) సాధించే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నా. రానున్న 15 ఏళ్లలో ఇది సాధ్యమవుతుందని నిపుణుల అంచనా. అయితే, పదేళ్లలోపే లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పంతో తెలంగాణ ఉంది. గత మూడు దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంత అభివృద్ధి దేశంలోనే అత్యంత వేగంగా ఉంది. ప్రతి ఆరేళ్లకు ఒకసారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని రెట్టింపు చేసే సామర్థ్యాన్ని స్థిరంగా కొనసాగించాం. ఇదే ఊపుతో ప్రస్తుత దశాబ్దంలోనే తెలంగాణ జీఎస్‌డీపీని ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళతాం.

*** మహిళా సాధికారికతకు కట్టుబడి ఉన్నాం**

మహిళా సాధికారికత... ఆర్థికాభివృద్ధి, సమానత్వం, సామాజిక న్యాయంతో ముడిపడింది. మహిళా సంఘాలకు పెట్టుబడులు సమకూరిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలంగాణ దృఢంగా విశ్వసిస్తోంది. అందుకే 'ఇందిరా మహిళా శక్తి మిషన్'ను ప్రారంభించాం. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల్లో ప్రస్తుతం 66 లక్షల మంది సభ్యులుండగా కోటికి పెంచడానికి కృషి చేస్తున్నాం. ఈ సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లను కేటాయించాం. వారి ద్వారా 600 బస్సులను రాష్ట్ర ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తున్నాం. పెట్రోల్ పంపు డీలర్‌షిప్‌లను కేటాయిస్తున్నాం. హైదరాబాద్ శిల్పారామంలోని నైట్ బజార్‌లో 106 మహిళా శక్తిబజార్లను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాం. ఈ క్రమంలో ఇప్పటివరకు రూ.510 కోట్ల విలువైన 27,303 పనులు పూర్తయ్యాయి.

**యువత నైపుణ్యాభివృద్ధికి బాటలు**

యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేశాం. ప్రపంచ స్థాయి క్రీడాకారుల తయారీ ధ్యేయంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేస్తున్న స్పోర్ట్స్ హబ్‌లో 12 ప్రత్యేక క్రీడా అకాడమీలు క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందిస్తాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మద్దతుగా 'రాజీవ్ గాంధీ సివిల్ సర్వీసెస్ అభయహస్తం' ప్రారంభించాం. వెనుకబడిన వర్గాల యువతకు స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభించాం.

**ఏడాదిలో 60 వేల ఉద్యోగాల భర్తీ**

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క సంవత్సరంలోనే 60 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ప్రైవేట్ రంగంలో మరో లక్షకు పైగా ఉద్యోగాలు వచ్చాయి. భవిష్యత్తు అవసరాలను తీర్చేలా శ్రామికశక్తి రూపకల్పనకు బలమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. అలాగే యువతీ యువకులను పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా, నాయకులుగా తీర్చిదిద్దుతున్నాం.

# సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రుణసాయం అందిస్తామని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ''చదువుకున్న నిరుద్యోగ యువత మేధస్సును వ్యాపార.. ఉత్పత్తి రంగాల్లో వినియోగించి.. జీడీపీ వృద్ధికి ఊతమిలా రాజీవ్ యువ వికాస పథకం చేపట్టాం. గతంలో యువతకు స్వయంఉపాధి రుణాలకు 70 శాతం రుణం, 30 శాతం సబ్సిడీ ఉండేది. ఇప్పుడది రివర్స్ (30 శాతం రుణం, 70 శాతం సబ్సిడీ) అయింది. రూ.8 లక్షల కోట్ల వార్షిక రుణ ప్రణాళికలో రాజీవ్ యువ వికాసం పథకం వాటా 0.2 శాతం మాత్రమే. గిరిజనుల అభ్యున్నతి కోసం రూ.12,600 కోట్లతో ఇందిరా సౌరగిరి జలవికాసం ప్రారంభించాం. ఆయిల్‌పామ్ సాగుకు బ్యాంకులు ఉదారంగా రుణాలివ్వాలి. రాష్ట్రంలో మానవ వనరుల అభివృద్ధికి స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి శాసనసభ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం'' అని భట్టి తెలిపారు.

**వ్యవసాయ రంగానికి రూ.1,62,946 కోట్ల రుణసాయం**

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 202526 ఆర్థిక సంవత్సరంలో రూ.1,62,946 కోట్ల మేరకు రుణసాయం అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఎస్‌ఎల్‌బీసీ తెలిపింది. 202425 లక్ష్యం కంటే ఇది 7.16 శాతం ఎక్కువని వెల్లడించింది. పంట రుణాల కింద నిరుటికంటే 3.4 శాతం ఎక్కువగా రూ.93,884 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.45,659 కోట్లు (గతేడాదికంటే 38.96 శాతం ఎక్కువ), వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.7251 కోట్లు (నిరుటికంటే 19.96 శాతం ఎక్కువ) రుణసాయం అందిస్తామని తెలిపింది. గురువారం హైదరాబాద్‌లో 45వ త్రైమాసిక నివేదికను విడుదల చేసింది.

* తెలంగాణ 202425లో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.60,477 కోట్లు పెరిగి, మొత్తం డిపాజిట్లు రూ.8,40,430 కోట్లకు చేరుకున్నాయి. అన్ని బ్యాంకుల్లో అప్పులు రూ.10,81,361 కోట్లుగా నమోదయ్యాయి.
* 202425లో బ్యాంకులు రూ.73,105 కోట్ల స్వల్పకాలిక ఉత్పత్తి రుణాలను పంపిణీ చేసి, వార్షిక లక్ష్యాల్లో 80.52% సాధించాయి.
* వ్యవసాయ అనుబంధ, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు పెట్టుబడి రుణంగా రూ.64,241 కోట్లను పంపిణీ(104.87%) చేశాయి.
* 202425లో ప్రాధాన్యరంగం కింద బ్యాంకులు రూ.580 కోట్ల విద్యారుణాలు, రూ.3,433 కోట్ల గృహరుణాలు ఇచ్చాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.1,21,343 కోట్లు పంపిణీ (93.60%)చేశాయి.
* ప్రధాన మంత్రి ముద్ర యోజన కింద రూ.13,472 కోట్లు మంజూరు చేసి 97.37% లక్ష్యాన్ని సాధించాయి'' అని ఎస్‌ఎల్‌బీసీ నివేదిక వెల్లడించింది.

# అందాల పోటీల నుంచి వైదొలగిన మిస్ ఇంగ్లాండ్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ప్రపంచ సుందరి 2025 పోటీల నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన ఆమె ఇంగ్లాండ్ చేరిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యల్ని బ్రిటిష్ మీడియా ప్రచురించింది. ఈ కథనాలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఖండించారు. ఆ వాదనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సైతం తోసిపుచ్చారు. గత వారం వ్యక్తిగత కారణాలతో పోటీ నుంచి తప్పుకొన్నానని పేర్కొన్న మిల్లా మాగీ తాజాగా బ్రిటిష్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. 'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే మిస్ వరల్డ్ నినాదం బాగానే ఉన్నా పోటీ పాతగా ఉంది. పోటీదారులు అల్పాహారం సమయంతోసహా అన్ని వేళల్లో మేకప్, బాల్ గౌన్లు ధరించాలన్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో టేబుళ్లపై పురుష స్పాన్సర్లు, అతిథులు అంటూ నలుగుర్ని, మాలో ఇద్దర్ని కేటాయించి అలరించాలన్నారు. వారిని సంతోషపెట్టడానికి ప్రదర్శన ఇచ్చే కోతుల్లా కూర్చోవడానికి అక్కడ ఉన్నామనే భావన కలిగింది. పోటీ అంటే విరక్తి కలిగేలా చేశారు. విలువలు లేని చోట మనసు చంపుకొని ఉండలేనని నాకు నేనే పోటీల నుంచి తప్పుకొంటున్నా' అని కంటతడి పెడుతూ చేసిన వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. 74 సంవత్సరాల మిస్ వరల్డ్ చరిత్రలో పోటీల నుంచి అర్ధాంతరంగా వైదొలగడం ఇదే మొదటిసారి అని యూకే మీడియా తెలిపింది.

**ఆమె పాల్గొన్నది ఒక్క డిన్నర్‌లోనే: జయేశ్**

మిల్లా మాగీ వ్యాఖ్యలు నిరాధారమైనవని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. ఆమె మాట్లాడినట్లుగా ఎక్కడా జరగలేదన్నారు. 'తన తల్లి ఆరోగ్యం బాగోలేదని.. స్పోర్ట్స్ ఛాలెంజ్ ఫైనల్ జరిగిన మరుసటి రోజు ఇంగ్లాండ్ వెళ్లిపోయారు. అంతకుముందు ఆమె ఒకే ఒక డిన్నర్‌కు హాజరయ్యారు. చౌమహల్లా ప్యాలెస్‌లో ప్రభుత్వం ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఎంపిక చేసి ఆహ్వానించిన అతిథులు 300 మంది పాల్గొన్నారు. ప్రతి టేబుల్‌పై పురుషులు, మహిళా అతిథులు ఉన్నారు. ఆమెను తప్పుగా చూడటం, ప్రవర్తించడం వంటి పరిస్థితే లేదు. ఆమెతోపాటు ఉన్న ఇతర మిస్ వరల్డ్ పోటీదారులనూ విచారించాం. అలాంటి తప్పుడు ప్రవర్తన ఎక్కడా జరగలేదు' అని తెలిపారని జయేశ్‌రంజన్ అన్నారు.

# శునకాలు.. క్యాన్సర్ పసిగట్టేస్తాయ్!

(మొదటిపేజీ తరువాయి)

మోడల్స్ ఉన్నాయి.

* పరీక్ష చేయించుకునే వ్యక్తి ప్రత్యేకంగా తయారుచేసిన మాస్కును 10 నిమిషాల పాటు పెట్టుకోవాలి.
* ఆ మాస్క్‌ను ప్రత్యేకమైన కిట్‌లో పెట్టి ల్యాబ్‌కు తరలిస్తారు.
* ఇతర వాసనలేవీ మాస్కుకు పట్టకుండా దాన్ని జాగ్రత్తగా బయో మెడికల్ డిటెక్షన్ కౌంటర్ వద్ద ఉంచుతారు.
* శిక్షణ పొందిన, బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)డాగ్‌సెన్స్ ధరించిన శునకం ఆ మాస్క్‌ను వాసన చూస్తుంది.
* అప్పుడు దాని మెదడులో జరిగే స్పందనలను ఈఈజీ అనే పరికరం నమోదు చేస్తుంది.
* ఈ డేటాను న్యూ మెషీన్ లెర్నింగ్ మోడల్స్, రియల్ టైమ్ సాంకేతికతతో కూడిన 'డాగోస్' అనే సాఫ్ట్‌వేర్‌తో నిపుణులు విశ్లేషించి.. క్యాన్సర్ ఉందో లేదో ఓ నిర్ధారణకు వస్తారు.

**ఇలా 10 రకాల క్యాన్సర్లను గుర్తించే వీలుంది.**

క్యాన్సర్‌ను నాలుగో దశలో గుర్తించడం వల్ల 90% మంది బాధితులకు వైద్యం అందించినా ఫలితం ఉండటం లేదు. ఈ సమస్య భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఎక్కువగా ఉంది. అదే.. ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే మరణాలు నివారించవచ్చని కర్ణాటకలోని బెళగావికి చెందిన ఆకాశ్ కుల్‌గోడ్ ఆలోచన. ఈ మథనంలోంచి వచ్చిన ఆలోచనే.. మల్టీ క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్ (ఎంసీఈడీ) విధానం. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కాగ్నిటివ్ న్యూరోసైన్స్ చేసిన ఆకాశ్.. కెనైన్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్‌లో 3 అధ్యయనాలు, ఒక మేధోహక్కు కూడా పొందారు. శునకాల శిక్షణ నిపుణులైన ఇజ్రాయెల్‌కు చెందిన ఇటామర్ బిటన్‌తో కలిసి ఎంసీఈడీని కనుగొన్నారు. ఈ పరీక్షలకు బీగిల్స్, ల్యాబ్రడార్ శునకాలను ఎంచుకున్నారు. కర్ణాటకలో 6 ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకొని పరిశోధనలు చేస్తున్నారు.

# రేషన్ తీసుకోవడం లేదు..

## కార్డుదారులేమయ్యారు?

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రంలో అనుమానాస్పద రేషన్‌కార్డులపై ప్రభుత్వం దృష్టి సారించింది. కార్డులు, లబ్ధిదారుల సంఖ్య మేరకు డీలర్లకు ప్రతి నెలా రేషన్ పంపిస్తున్నప్పటికీ చాలామంది తీసుకోవడం లేదు. దీంతో పౌరసరఫరాల శాఖ గడిచిన ఆరు నెలల నుంచి బియ్యం తీసుకోనివారి లెక్కలు తీయగా.. ఏకంగా 96 వేల కార్డులు తేలాయి. ఇందులో ఈ నెల 22 వరకు చేపట్టిన విచారణలో 6 వేలకు పైగా రేషన్‌కార్డులు అనర్హమైనవిగా అధికారులు గుర్తించారు.

**క్షేత్రస్థాయిలో విచారణ..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక పథకాలకు రేషన్‌కార్డే అర్హత కావడంతో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ఉన్న లబ్ధిదారుల్లో అనేకమంది అనర్హులున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మే మొదటివారం నాటికి 90.71 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో లబ్ధిదారుల సంఖ్య 2.93 కోట్లు. వీరి కోసం ప్రతి నెలా 1.90 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం డీలర్లకు పంపిస్తోంది. ఉచితంగా సన్నబియ్యం పంపిణీ మొదలయ్యాక వాటిని తీసుకోవడానికి బారులు తీరుతున్నా.. 1.6 లక్షల మంది మాత్రం ముందుకు రావడం లేదు. దీంతో పౌరసరఫరాల శాఖ వారి జాబితా తీసి ఆయా మండలాల్లో తహసీల్దార్లతో క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో ఉంటున్నారా? లేదా మరణించారా? అని పరిశీలిస్తున్నారు. మరోవైపు వందేళ్ల వయసు పైబడి చనిపోయినవారు రేషన్ లబ్ధిదారుల జాబితాలో పెద్దసంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొందరికి రెండేసి కార్డుల్లో పేర్లున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో తేలిన సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయానికి పంపిస్తున్నారు.

# పాలిసెట్‌లో 81.88%మంది పాస్

(మొదటిపేజీ తరువాయి)

మంది, ఎంబైపీసీ విభాగంలో 83,364 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష 120 మార్కులకు నిర్వహించగా 36 మార్కులు పొందిన వారు ఉత్తీర్ణులవుతారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కనీసం ఒక మార్కు పొందటం తప్పనిసరి. ఎస్సీ విద్యార్థులు 18,039 మంది పరీక్ష రాయగా.. వారిలో ఇద్దరికి ఒక మార్కు కూడా రాకపోవడంతో తప్పారు. ఇక ఎస్టీ విద్యార్థులు 7,459 మందికి మొత్తం పాసయ్యారు. ఒక్కో అభ్యర్థికి ఎంపీసీ విభాగంలో ఒక ర్యాంకు, ఎంబైపీసీ పేరిట మరో ర్యాంకు కేటాయించారు. ఈ సందర్భంగా శ్రీదేవసేన మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం (202526)లో కొత్తగా కేసముద్రం, పటాన్‌చెరులో రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు అందుబాటులోకి వస్తాయని, వాటికి ఏఐసీటీఈ నుంచి అనుమతులు వచ్చాయన్నారు. రెండు కొత్తవి కలిపి ప్రభుత్వ కళాశాలల సంఖ్య 59కి చేరిందని చెప్పారు. ఏఐసీటీఈ నుంచి ఇంకా అనుమతులు రాలేదని, వచ్చిన తర్వాత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీటెట్ పరీక్షల కంట్రోలర్ షఫియాజ్ అక్తర్, డిప్యూటీ డైరెక్టర్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ముందే పలకరించిన 'నైరుతి'

(మొదటిపేజీ తరువాయి)

**25 ఏళ్లలో మూడోసారి..**

సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తుంటాయి. అంచనాల కంటే బాగా ముందుగా రావడం 25 ఏళ్లలో ఇది మూడోసారి కాగా 16 ఏళ్లలో ఇదే తొలిసారి. గతంలో 2001, 2009లలో మే చివర్లో దేశంలోకి ప్రవేశించాయి. 2023లో వారం రోజులు ఆలస్యంగా జూన్ 8న, గతేడాది రెండు రోజులు ముందుగా మే 30న రుతుపవనాలు కేరళను తాకాయి. ప్రస్తుతం అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం రుతుపవనాలను బలంగా ముందుకు లాగినట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నందున చురుకుగా విస్తరిస్తాయని అంచనా వేస్తున్నారు. సోమవారానికే రాయలసీమ మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని భావిస్తున్నారు.

**తీరం దాటిన వాయుగుండం**

అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడింది. ఇది తూర్పు దిశగా పయనించి మహారాష్ట్రలోని రత్నగిరి, దాపోలి మధ్యలో తీరం దాటింది. తర్వాత తూర్పు దిశగా మహారాష్ట్ర వైపు కదులుతూ ఆదివారానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని అంచనా. దీని ప్రభావంతో మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు తీరం దాటిన వాయుగుండం మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ మీదుగా పయనించి ఈ నెల 27 నాటికి బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని అంచనా వేస్తున్నారు.

**27న మరో అల్పపీడనం**

ఉత్తర ఒడిశా సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఈ నెల 27 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. వీటి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. ఆదివారం అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. సముద్రం అలజడిగా మారినందున ఈ నెల 28 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది.

# ప్రభుత్వమంటే మీకు కృతజ్ఞత లేదా?

అమరావతి: 'రాష్ట్రంలో సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. ఈ రంగంలో ఉన్నవారి గౌరవ, మర్యాదలకు భంగం కలగకుండా చూస్తోంది. అలాంటిది తెలుగు సినీరంగంలో ఉన్న వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబును కనీసం మర్యాదపూర్వకంగా వారు కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంగా ప్రభుత్వం ముందుకు రావడం మినహా చిత్రరంగ అభివృద్ధి కోసం సంఘటితంగా వచ్చింది లేదు' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు శనివారం ఓ సుదీర్ఘ ప్రకటన జారీచేసింది. అందులో సినీ పరిశ్రమకు సంబంధించిన అనేక విషయాలను ప్రస్తావించింది. ఆ వివరాలివీ..

**సంఘటితంగా ఎందుకు రారు?**

'సినీ పరిశ్రమ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించినా ఎవరూ సానుకూలంగా స్పందించలేదు. తెలుగు అగ్రనటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఎలా ఇబ్బందులు పెట్టిందో తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వంటి సంఘాలు మరిచిపోయినట్లున్నాయి. రూ.కోట్ల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్నివిధాలా ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు సృజనాత్మకత ముడిపడిన ఈ రంగంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదని కూటమి పార్టీలు ఎన్నికల ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు ఇప్పుడు మరిచిపోతే ఎలా? ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందినవారి చిత్రం విడుదలైనప్పుడు సైతం ప్రభుత్వం తగు విధంగా ప్రోత్సహించింది' అని పవన్‌కల్యాణ్ కార్యాలయం పేర్కొంది. 'సినిమా వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డవారు ఇబ్బంది పడకూడదు అనేదే కూటమి ప్రభుత్వ విధానం. సినిమా రంగం వారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి టికెట్ ధరలు పెంచాలని కోరడం ఎందుకు? అందరూ కలిసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించాలని పవన్‌కల్యాణ్ గతంలోనే సూచించారు. దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేష్‌బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చని కూడా పవన్‌కల్యాణ్ చెప్పారు. అయినా ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి టికెట్ ధరలు పెంచాలంటూ సినిమాటోగ్రఫీ శాఖకు అర్జీలు ఇస్తున్నారు. దానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోంది' అని చెప్పింది.

# జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆలోచనలోనుంచి మరో మార్గదర్శకం బయోచార్





## జిల్లాలో బయోచార్‌తో ముందుకు వెళ్లాలని ఆకాంక్ష

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి వ్యవసాయం మరియు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా బయోచార్ తయారీకి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ దిశగా ఆయన కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయం పక్కనే స్వయంగా మొట్టమొదటి ప్రయోగాత్మక ప్రదర్శనను నిర్వహించారు.ముందుగా ఒక ఖాళీ డ్రమ్ తీసుకొని దాని కింద భాగంలో గాలి ప్రవేశించేలా రంధ్రాలు చేశారు. ఆ డ్రమ్‌ను మూడు సిమెంట్ రింగుల మధ్య ఉంచి, అడుగులో ఎండిన ఆకులు వేసి మంట వెలిగించారు. పైభాగంలో ఎండిపోయిన, పనికిరాని మొక్కల భాగాలను వేసి, డ్రమ్‌కి మూత పెట్టారు. రింగుల మధ్యలోనూ ఆకులు, పొట్లులు వేసి మంట పెట్టడంతో లోపల ఏర్పడే పొగ తక్కువగా ఉంటుంది. తక్కువ ఆక్సిజన్‌లో కాలిన మొక్కలు బూడిదగా మారకముందే వాటిని నీటితో చల్లార్చితే, ఏర్పడిన బొగ్గును బయోచార్ అంటారని కలెక్టర్ స్వయంగా ప్రదర్శించారు. దీనిని పొడి లాగా చేసి పంటపొలాల్లో వాడితే మంచి ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు, దీనికి పశు మూత్రం జోడించి ఉపయోగిస్తే మరింత ఫలితం ఉంటుందని తెలిపారు.

### బయోచార్ అంటే ఏమిటి? కలెక్టర్ మాటల్లో...

బయోచార్ అనేది పంట మిగులు, ఎండిపోయిన మొక్కలు, చెట్ల కొమ్మలు వంటి జీవ పదార్థాలను తక్కువ ఆక్సిజన్ ఉన్న పరిస్థితుల్లో కాల్చి తయారుచేసే ప్రకృతి మిత్ర పదార్థం. ఇది శాశ్వతంగా కార్బన్ నిల్వ చేస్తూ, నేల ఆరోగ్యాన్ని పెంపొందించే గుణాలు కలిగి ఉంటుంది. కలెక్టర్ బయోచార్ యొక్క ఉపయోగాలను ఈ విధంగా వివరించారు. మట్టిలో జీవ పదార్థం పెంపు, నీటి నిల్వ సామర్థ్యం మెరుగుదల, ఎరువుల అవసరం తగ్గింపు, వాతావరణ మార్పుల ప్రతికూలతలను తగ్గించే శాశ్వత కార్బన్ నిల్వ, నేల స్థిరంగా ఉండేలా చేయడం వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. పంట అనంతరం మిగిలిన మొక్కల చెత్త, గ్రామ శుభ్రపరిచే పనుల్లో వెలువడే చెట్ల భాగాలు వంటి వనరులు విరివిగా లభిస్తున్నాయి. వీటిని వినియోగించి గ్రామస్థాయిలో చిన్న బయోచార్ యూనిట్లు ఏర్పాటు చేస్తే, రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటమే కాకుండా, స్వయం ఉపాధికి మార్గం సుగమమవుతుంది. ఇది ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే ఉత్తమ మార్గంగా నిలుస్తుందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు.

## టీజేఎఫ్ 25 వసంతాల మహాసభలను విజయవంతం చేయాలి

* **టీజేఎఫ్ రజతోత్సవ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ జర్నలిస్టు ఫోరం 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ లోని జలవిహార్ లో ఈ నెల 31న జరిగే 25 వసంతాల మహాసభలను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.కె. దయాసాగర్, టియుడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షుల నిమ్మల శ్రీనివాస్ లు కోరారు. టీయూడబ్ల్యూజే కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రిక ఆవిష్కరణకు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.కె. దయాసాగర్, టియుడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షుల నిమ్మల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోహీరు నాగరాజు , సీనియర్ జర్నలిస్టులతో కలిసి శనివారం కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలను ఏకతాటి పైకి తీసుకొచ్చి స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో కీలక భూమిక పోషించిందని అన్నారు. టీజేఎఫ్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో జరిగే వేడుకలను విజయవంతం చేయాలని జర్నలిస్టు మిత్రులందరికీ పిలుపునిచ్చారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కూకట్పల్లి ప్రెస్ క్లబ్ టియుడబ్ల్యూజే నాయకులు వి భాస్కరాచారి, కైలాష్ నేత,జాషువా, ఆనంద్ రావు, తేళ్ల హరికృష్ణ, దాదే వెంకట్, బొమ్మ గోపి లక్ష్మణ్ గౌడ్, హరికుమార్ చౌదరి, షబ్బీర్, కుల్లరాజు, శ్రీనివాస్ రెడ్డి, హరి, చంద్రకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి లో టిజె ఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ



నేరెడ్ మెట్, (ప్రజాస్ఫూర్తి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మల్కాజ్గిరి సర్కిల్ టియుడబ్ల్యూజే(143) అధ్యక్షులు జార్జ్ విల్సన్,ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్ గడ్డమీది లు కోరారు. శనివారం మల్కాజిగిరి సర్కిల్ గాంధీ పార్క్ ప్రాంగణంలో ఉన్న మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ ఆవరణలో ఈనెల 31న టి జె ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ను స్థానిక జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలవేళ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్, హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరచలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బద్దల మురళీ కృష్ణ యాదవ్, అక్కల రాజేందర్ గౌడ్, పాండు గౌడ్, చేగుంట నరేష్ బాబు,, సాయి కిరణ్ గౌడ్, శివ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆ దెయ్యాలు ఎవరో కేటీఆర్ చెప్పాలి: మంత్రి పొన్నం డిమాండ్

ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ పార్టీలో దెయ్యాలున్నాయని వ్యాఖ్యానించారు.. ఆ దెయ్యాలెవ్వరో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని మంత్రి పొన్నాల లక్ష్మయ్య డిమాండ్‌చేశారు. శనివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కేక్ కట్ చేయగా పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ మాట్లాడడం కాదని.. ముందుగా పార్టీ అంతర్గతంగా జరుగుతున్న అంశాలపై మాట్లాడాలని హితవు పలికారు.



## షరతులు పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తున్న రేవంత్ సర్కార్

### జాతీయ బిసి సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : షరతులు పెట్టి రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తుందని జాతీయ బిసి సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి ఆరోపించారు. శనివారం ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి షరతులు లేకుండా అర్హులైన అందరికీ రాజీవ్ యువ వికాసం రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ పథకానికి 16 లక్షల 25 వేల 441 మంది యువతీ యువకులు దరఖాస్తు చేసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం 6 వేల 250 కోట్లను కేటాయిస్తున్నామని, 5 లక్షల మందికి పథకం వర్తిపజేస్తామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పారని, లబ్ధిదారులు 16 లక్షల పైన మంది ఉన్నందున ప్రభుత్వము 15 వేల కోట్లు కేటాయించి అప్లై చేసుకున్న ప్రతి నిరుపేద యువతీ, యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధిచేకూరే విధంగా చూడాలని, ఇందులో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎవరి ప్రమేయం లేకుండా అధికారులే పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని, గ్రామీణ స్థాయిలో కొందరు పథకం ఇప్పిస్తాని చేతివాటం చూపించే అవకాశం ఉందని, అలాంటివి జరిగితే సహించేది లేదని, అలానే ఎంపిక ప్రక్రియలో బ్యాంకర్ల జోక్యం అతిగా లేకుండా చూడాలని, అధికారులే నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతమంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు యువ వికాసం పథకంలో కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం ఇస్తామని బహిర్గతంగా చెప్పడం చాలా సిగ్గుచేటని ప్రభుత్వ సొమ్మును అధికార పార్టీ కార్యకర్తలకు అక్రమంగా ఇవ్వాలని చూస్తే సహించేది లేదని, ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగిన, అనర్హులను పథకంలో చేర్చిన దరఖాస్తుదారుల పక్షాన ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య, సంతోష్, రమేష్, శ్రీనివాస్, రాజు, భాను, శేఖర్ చారి తదితరులు పాల్గొన్నారు.





## రూ.3.40 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: టేకులపల్లి మండల పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా నిషేధిక గంజాయి పట్టుబడింది. శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు టేకులపల్లి పోలీసులు , సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. దీనిలో భాగంగా రెండు వాహనాల్లో రూ.3.40 కోట్ల విలువచేసే గంజాయి లభించినట్లు సీఐ టి.సురేష్ తెలిపారు. ఐచర్ వ్యానులో ఉన్న ముగ్గురు వ్యక్తులను, కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు సీఐ వివరించారు. హర్యానాకు చెందిన సందీప్ కుమార్, లక్విందర్, అమర్‌నా□ద్ కుమార్, పవన్ కుమార్, రాజ్ కుమార్, కృషన్ కుమార్ అనే వ్యక్తులు అక్రమంగా గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన వారిలో ఉన్నారన్నారు. రెండు వాహనాలతోపాటు నిందితుల వద్ద నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు అటవీ ప్రాంతం నుండి హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర ప్రాంతానికి ఈ గంజాయిని తరలిస్తున్నారని చెప్పారు. హరిఖరా, కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్ కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీస్ మాటున ఇట్టి గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన వారిని జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టునకు తరలించగా వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అక్రమ గంజాయి రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న టేకులపల్లి సిఐ టి.సురేష్, ఎస్సై ఏ.రాజేందర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్,రామారావు , సిబ్బందిని ఎస్పి రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు

## మడేలేశ్వర స్వామి వార్షికోత్సవంలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షుడు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్ గ్రామంలో గ్రామ రజక ఆధ్వర్యంలో నిర్వహించిన మడేలేశ్వర స్వామి వార్షికోత్సవంలో బిజెపి మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆయన వెంట బిజెపి సీనియర్ నాయకులు శ్రీనివాస రావు, బాధా నరేష్, చిగురు వెంకన్న, నక్కల రాజు. కాసారపు రవి, సుంకరి రాజేష్, గణేష్, దేవరాజు, శ్రీకాంత్, సుమంత్, శివ, శశి, బలేశ్వర్ రెడ్డి, ఊరాడి రాజు, నవీన్, ప్రశాంత్, సింగపూర్ దేవయ్య, నక్కదాసరి రవి, మధు, రమేష్ తదితరులున్నారు.

## సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వ పాలన

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలంలో 22 మంది లబ్ధిదారులకు మంజూరైన 9లక్షల 25వేల రూపాయల విలువజేసే సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు చెందిన వారికి ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం అందించేందుకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, బిసి సెల్ మండల అధ్యక్షులు శీల ప్రశాంత్, గూడెం, మద్దికుంట, బందనకల్ గ్రామ శాఖ అధ్యక్షులు బాబు, దొనుకుల కొండయ్య, తుపాకుల శ్రీనివాస్, మామిండ్ల ఆంజనేయులు, యాగండ్ల మల్లేశం, షాదుల్ పాషా, పుల్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## బోర్వెల్ పనులు ప్రారంభం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ లోని శ్రీ భ్రమరంభా మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూకట్ పల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ మాధవరం కృష్ణ రావు ఆదేశాల మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో బోర్ వెల్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, సమ్మా రెడ్డి, గోపాల్ రెడ్డి, సంబ మూర్తి , ఎండి ఇస్మాయిల్, సాయి గౌడ్, తేజ, శ్రీను తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుకై అన్ని వసతులను వినియోగించుకోవాలి

* **బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుకై అవసరమైన అన్ని వసతులను వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న "వృత్యంతర శిక్షణ" కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల



తల్లిదండ్రులు అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. విషయ పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. . ఈ కార్యక్రమంలో దుండిగల్ మండల విద్యాధికారి కృష్ణ, మండల్ రిసోర్స్ పర్సన్ రమేష్, ఉపాధ్యాయ ఉపాధ్యాయినిలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాలను అరికట్టేందుకు స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తున్నాం

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వాహనాల వేగాన్ని తగ్గించి, ప్రమాదాలను అరికట్టే విధంగా స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తున్నామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రదాన రహదారిలో తులసివనం వద్ద ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేయాలన్న విషయాన్ని తులసివనం అపార్ట్మెంట్ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకరవచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ సమస్యను శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత జి.ఎచ్.ఎం.సి అధికారులతో చర్చించి స్పీడ్ బ్రేకర్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఉషముళ్ళపూడి ప్రధానరహదారిలో తులసివనం వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.కె రెడ్డి, శ్రావణ్ కుమార్, నాగ కృష్ణ, హరి కిషోర్, తులసివనం అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయంగా ఆదుకోవాలి

* **మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేసిన షాపులకూ గాను రోడ్డు విస్తరణకి పోగా మిగిలిన 20 ఫీట్ స్థలంలోనే ప్రత్యామ్నాయ షాపులు ఏర్పాటు చేసి ఆ 8 కుటుంబాలని ఆదుకోవాలని మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. శనివారం కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి అధికారులు కనీసం ఒక నీ ఇన్ఫర్మేషన్ అయినా ఇచ్చి ఉంటే వ్యాపారులకి కొంత ఆస్తి నష్టం వ్యాపారులకు తగ్గేదన్నారు. మూసాపేట్ చౌరస్తా నుండి ఆంజనేయ నగర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో ఇందిరా గాంధీ బొమ్మ సమీపంలో ఒక ఎనిమిది షాపులు నాడు కేంద్ర మంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయ అన్ని పర్మిషన్లతో షాపులు పెట్టించారన్నారు. గత



సంవత్సరాలు 15 సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటున్నటువంటి ఈ కుటుంబాలకు జిహెచ్ఎంసి స్థలం కేటాయించాలని వారికి చెప్పాలన్నారు, రోడ్డు విస్తరణ జరిగినప్పటికీ, రోడ్డు విస్తరణ జరిగినాక మిగిలే 20 ఫీట్స్ ప్రభుత్వ స్థలం అక్కడుంటుందని అక్కడే వీరికి ఉపాధి అందే విధంగా షట్టర్లు నిర్మించాలని కమిషనర్ ని కోరారు.2008లో అప్పటి డిప్యూటీ కమిషనర్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వీరికి వేరే జాగాలో షట్టర్లు నిర్మించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి దానిని తుంగలో తొక్కారని వారికి గుర్తు చేశారు. ఈ చిరు వ్యాపారులకు ఏదో ఒక విధంగా ఉపాధి అందే విధంగా షట్టర్లు నిర్మించే ఆలోచన చేయాలని కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాసెట్టి నర్సింగ్ రావు, షాపు ఓనర్లు, బిజెపి సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, కృష్ణ యాదవ్ .తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే తన లక్ష్యం

* **బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే తన లక్ష్యమని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధ్యక్షతన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్ల లో అభివృద్ధి పనుల పురోగతి పై వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని



పలు డివిజన్ల లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికే పలుమార్లు ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండ కాలనీలలో మౌలిక వసతుల కల్పించాలన్నారు. ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టవలసిన చర్యలను అధికారులు చేపట్టి అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమీషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, విద్యాశాఖ లతో పాటు వివిధ శాఖల అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను పరిశీలించిన కాంగ్రెస్ నేత , కమిషనర్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 13, 14 డివిజన్లోని పలు రకాల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఎన్ ఎం సి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ అలీ తో ఆయన కలిసి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సాధ్యమైనంత తొందరగా ఈ సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎం సి మున్సిపల్ సిబ్బందులు,కుమార్ యాదవ్,శ్రీశైలం యాదవ్,ఎన్ ఎం సి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కడియాల ఇందిరా,13 అధ్యక్షులు లింగాల గంగాధర్,14 డివిజన్ అధ్యక్షులు మామిళ్ళపల్లి శ్రీనివాస్,12 డివిజన్ అధ్యక్షులు కృష్ణంరాజు,వర్మ రాజు,14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, పంగా శ్రీనివాసరావు,నరసింహ యాదవ్, ఈశ్వర్ కిరణ్, శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), దుర్గాప్రసాద్, కురమయ్య, రమ (మెడిటేషన్ మాస్టర్) , కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలనీవాసులు, ఇతర కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పోటీల నుంచి వైదొలగిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ

* **స్పందించిన మిస్ వరల్డ్**

హైదరాబాద్: భారత్‌లో జరుగుతోన్న 72వ మిస్‌వరల్డ్ పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ 2025 మిల్లా మాగీ వైదొలిగిన విషయాలపై మిస్ వరల్డ్ సంస్థ స్పందించింది. ఇటీవల బ్రిటీష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలపై మిస్ వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్, సీఈవో జూలియా మోర్లే స్పందించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మిస్ ఇంగ్లాండ్ మాగీ చేసిన ఆరోపణలను ఖండించారు. ఈనెల ప్రారంభంలో మిస్ ఇంగ్లాండ్ మాగీ.. తన తల్లి, కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సంబంధించి అత్యవసర పరిస్థితి కారణంగా ఈ పోటీల నుంచి విరమించుకోవాలని సంస్థను కోరినట్టు తెలిపారు. మిల్లా పరిస్థితి అర్థం చేసుకొని, వెంటనే స్పందించి ఆమె కుటుంబ సభ్యుల క్షేమం ప్రథమ ప్రాధాన్యతగా పరిగణించామన్నారు. తక్షణమే ఆమెను ఇంగ్లాండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మిల్లా.. మిస్ వరల్డ్ పోటీల నుంచి వైదొలిగిన తర్వాత మిస్





ఇంగ్లాండ్ మొదటి రన్నరప్ మిస్ షార్లెట్ గ్రాంట్ ఇంగ్లాండ్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారని వెల్లడించారు. మిస్ షార్లెట్ బుధవారం ఇండియాకు చేరుకున్నారని, మిస్ వరల్డ్ సోదరభావంతో ఆమెను పోటీల్లో పాల్గొనేందుకు అనుమతించినట్టు చెప్పారు. ఆమె ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. బ్రిటిష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలు, కొన్ని యూకే మీడియా సంస్థలు మిల్లా మాగీ పోటీల్లో ఎదుర్కొన్న అనుభవాలపై తప్పుడు కథనాలు ప్రచురించాయని, అవి పూర్తిగా నిరాధారమైనవని తోసిపుచ్చారు. మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ సమయంలో మిస్ మిల్లా మాగీ స్వయంగా వ్యక్తపరిచిన భావాలు, ఎడిట్ చేయని వీడియో క్లిప్‌లు మిస్ వరల్డ్ సంస్థ విడుదల చేసింది. అందులో ఆమె ఆనందం, కృతజ్ఞత, ఈ అనుభవం మెచ్చుకుంటూ మాట్లాడిన దృశ్యాలు కూడా ఉన్నాయని మోర్లే చెప్పారు.





* **'సిస్టర్ స్ట్రోక్'తో కేటీఆర్ చిన్న మెదడు దెబ్బతిన్నదని సీతక్క వ్యాఖ్య**
* **కాళేశ్వరం కమీషన్ల విషయంలో ఇప్పుడు భయమెందుకని ప్రశ్న**
* **కేటీఆర్‌కు గోబెల్స్ అవార్డు ఇవ్వాలంటూ వ్యంగ్యం**
* **అబద్ధాలతో బీఆర్ఎస్ పార్టీ మనుగడ సాగిస్తోందని ఆరోపణ**
* **రాహుల్, రేవంత్‌లపై విమర్శలు**

# కవిత చెప్పిన ఆ దెయ్యం కేటీఆరే కావొచ్చు : మంత్రి సీతక్క

**మానుకోవాలని కేటీఆర్‌కు హితవు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. కేటీఆర్ ఆరోపణలను తిప్పికొడుతూ, ఆయనపై ఘాటైన విమర్శలు చేశారు. సచివాలయంలో మీడియాతో సీతక్క మాట్లాడుతూ, "సిస్టర్ స్ట్రోక్ దెబ్బకు కేటీఆర్‌కు చిన్న మెదడు చితికిపోయింది" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం, ఇప్పుడు విచారణ కమిషన్ ముందుకు రావడానికి ఎందుకని కేటీఆర్‌ను ఆమె సూటిగా ప్రశ్నించారు. గోబెల్స్ తరహా ప్రచారంలో కేటీఆర్‌ను మించిన వారు లేరని, ఆయనకు "గోబెల్స్ అవార్డు" ఇవ్వాలని ఎద్దేవా చేశారు. "అబద్ధాల పునాదుల మీదే బీఆర్ఎస్ పార్టీ నడుస్తోంది. గోబెల్స్‌ను కూడా కేటీఆర్ మించిపోయారు. కవిత చెప్పిన దెయ్యం బహుశా కేటీఆరే కావొచ్చు," అని సీతక్క వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి, అర్హత కేటీఆర్‌కు లేవని ఆమె అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయినప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉంది బీఆర్ఎస్ కాదా అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు పొం దడం కోసమే కేటీఆర్ పదేపదే ఈడీ ప్రస్తావన తెస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్య క్షుడిగా ఉన్న సమయంలోనే ఆయనపై కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. యుద్ధంలో ట్రంప్ అనుసరించే నీతిని మోదీ అమలు చేస్తున్నారని, అబద్ధాన్ని నిజం చేయడం కోసం కేటీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కేటీఆర్ పూర్తిగా విస్మరించారని మంత్రి సీతక్క అన్నారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై అనవసరమైన, తప్పుడు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. "మీకు నిజంగా నీతి, నిజాయితీ ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు కూలేశ్వరం అయిందో ప్రజలకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన పత్రికకు (నేషనల్ హెరాల్డ్ ఉద్దేశించి) సహాయం చేస్తే తప్పేంటని ప్రశ్నించిన ఆమె, "గులాబీ కూలీల" రూపంలో దోచుకున్న వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు.

# ప్రధాని త్వరలో మమ్మల్ని కలుస్తామన్నారు : పహల్గాం మృతుడి కుటుంబం



పహల్గాం ఉగ్రదాడిలో హనీమూన్ కోసం కశ్మీర్‌కు వెళ్లిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారి శుభమ్ ద్వివేది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన కుటుంబం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో తమను కలుస్తానన్నారని పేర్కొన్నారు. మే 30న కాన్పూర్ ఎంపీ రమేష్ అవస్థి కార్యాలయంలో ప్రధాని తమను కలవనున్నారని శుభమ్ ద్వివేది తండ్రి తెలిపారు. పహల్గాం ఘటనలో ఉగ్రదాడిలో మొదటి తూటా తన భర్త ప్రాణాన్నే బలితీసుకుందని..అందుకు అయనకు అమరవీరుడి హోదాను ఇవ్వాలని శుభమ్ ద్వివేది భార్య ఇషానాయ్ ద్వివేది కొద్ది రోజుల క్రితం ప్రభుత్వాన్ని కోరారు. ఆ విషయాన్ని అమె గుర్తు చేస్తూ..తాము హిందువులం కాబట్టే ఉగ్రవాదులు తన భర్తను కాల్చి చంపారని అన్నారు. అతడి త్యాగాన్ని గుర్తిస్తూ..కేంద్ర ప్రభుత్వం తన భర్తకు అమరవీరుడి హోదాను ఇవ్వాలని ప్రధానిని స్వయంగా కోరుతామని తెలిపారు. ..ఈ గౌరవంతో అతడి మరణానికి తగిన న్యాయం జరగడమే కాక.. దేశం అందించే అత్యున్నత నివాళి అవుతుందని అన్నారు. ఇందుకు ప్రధాని మోదీ అంగీకరిస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌కు చెందిన శుభమ్ ద్వివేదికి.. ఇషానాయ్ ద్వివేది ఫిబ్రవరి 12న వివాహమైంది. వృత్తిరీత్యా బిజీగా ఉండే ద్వివేది.. తన భార్యతో కశ్మీర్‌కు విహార యాత్ర కోసం వెళ్లారు. వారు బైసరన్ లోయలో సరదాగా విహరిస్తున్న సమయంలో వారిని చుట్టుముట్టిన ఉగ్రవాదులు పేరు అడిగి ముందుగా ద్వివేది తలపై కాల్చి చంపినట్లు ఆయన భార్య పేర్కొన్నారు. ఆయనతో పాటు తననీ చంపమని అడిగితే తాము మహిళలను చంపబోమని..ఈ దాడి గురించి వెళ్లి ప్రధాని మోదీకి చెప్పుకొమ్మని అన్నారని కన్నీటిపర్యంతమయ్యారు. ఆ దాడిలో ద్వివేదితో సహా 26మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు.



## కరోనా కేసులపై అప్రమత్తంగా ఉన్నాం

### : కేంద్ర వైద్యశాఖ

దిల్లీ: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కేంద్ర వైద్య శాఖ స్పందించింది. అప్రమత్తంగా ఉన్నామని, కరోనా కేసుల నమోదుపై సమీక్ష చేస్తున్నట్లు తెలిపింది. "కొన్ని రాష్ట్రాల్లో కరోనా కేసుల నమోదుపై సమీక్షించాం. కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో కరోనా కేసులు నమోదయ్యాయి. వైరస్ సోకిన వారు ఇంటివద్దే చికిత్స తీసుకుంటున్నారు" అని కేంద్ర వైద్యశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

## కశ్మీర్ పోలీసులకు జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ



పహల్గాం ఉగ్రదాడి సమయంలో ఉగ్రవాదులు దట్టమైన అటవీ ప్రాంతాన్ని అవకాశంగా తీసుకొని పర్యాటకులపై దాడి చేసి 26 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. ఇటువంటి ఉగ్రవ్యూహాలను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లోని పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సిబ్బందికి జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించింది. కశ్మీర్, ఇతర సరిహద్దు ప్రదేశాల్లోని పర్వత ప్రాంతాలు, ప్రమాదకరమైన అటవీ భూభాగాలపై అవగాహన ఉన్న ఉగ్రవాదులను ఎదుర్కోవడమే లక్ష్యంగా ప్రమాదకరమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులకు యుద్ధ మెళకువల్లో శిక్షణనిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోలీసులకు శిక్షణనిచ్చే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి డీజీపీ నళిన్ ప్రభాత్‌కు అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో ఎలైట్ యాంటీనక్సల్ గ్రేహౌండ్స్ కమాండర్‌గా పనిచేసిన ప్రభాత్ కశ్మీర్‌లోని ఎత్తైన ప్రదేశాల్లో సిబ్బందికి శిక్షణనిస్తున్నారు. "శిక్షణలో సైనికులు ఎంత చెమటోడిస్తే..యుద్ధంలో అంత తక్కువ రక్తపాతం జరుగుతుంది" అని ఓ సీనియర్ అధికారి సిబ్బందికి సూచించారు.

**బహుళ-స్థాయి శిక్షణ**

అధికారులు ఎస్‌ఓజీ బృందాలకు దేశంలోని ప్రమాదకర బహుళ ప్రదేశాలలో శిక్షణ ఇస్తున్నారు. కొన్ని బ్యాచ్‌లు ఇప్పటికే ముఖ్యమైన శిక్షణను పొందాయి. ఇందులో భాగంగా తెలంగాణలోని గ్రేహౌండ్స్, జంగిల్ వార్‌ఫేర్ స్కూల్, పంజాబ్‌లోని తల్వారాలోని వైట్ నైట్ కార్ప్స్ బేస్, కశ్మీర్‌లోని దోడాలోని కార్ప్స్ బాటిల్ స్కూల్స్ లలో పలు సెషన్‌లు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ కేంద్రాలలో సిబ్బందికి రోజుల తరబడి ప్రతికూల పరిస్థితులలో జీవించడం, శత్రువులను ట్రాక్ చేస్తూ దట్టమైన అడవులను నావిగేట్ చేయడం వంటి వాటిలో శిక్షణ ఇస్తారు. విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలోని అన్ని ప్రదేశాలపై అవగాహన ఉండేలా మ్యాప్‌ల సహాయంతో క్లిష్టమైన ప్రదేశాలకు త్వరగా చేరుకునేలా మెళకు వలు నేర్పిస్తారు. అయితే పహల్గాం దాడి సమయంలో స్థానికంగా నిఘా వర్గాలు లేకపోవడం కూడా ఓ వైఫల్యంగా భావించిన అధికారులు మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ల ఏర్పాటుపైనా దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.

## గుజరాత్‌లో పాకిస్థాన్‌కు సమాచారం చేరవేస్తున్న గూఢచారి అరెస్ట్..



పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలతో గుజరాత్‌లో ఒక వ్యక్తి అరెస్టయ్యాడు. కచ్ సరిహద్దులో అతడిని అరెస్ట్ చేసినట్లు గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ప్రకటించింది. అతడి పేరు సహదేవ్ సింగ్ గోహిల్ అని, అతడు కచ్, దయాపుర్‌లో ఆరోగ్యకార్యకర్తగా పనిచేస్తున్నాడని వెల్లడించింది. భారత వైమానిక దళం , బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చెందిన కీలక సమాచారాన్ని షేర్ చేసినట్లు అతడి తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. 2023లో సహదేవ్‌కు వాట్సప్‌లో అదితి భరద్వాజ్ పేరుతో ఒక యువతి పరిచయమైంది. ఐఏఎఫ్, బీఎస్‌ఎఫ్‌కు చెందిన నూతన నిర్మాణాల ఫొటోలను ఆమెకు పంపినట్లు తమకు సమాచారం అందిందని ఏటీఎస్ అధికారి సిద్దార్థ్ మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటి దృశ్యాలను షేర్ చేసినట్లు చెప్పారు. మే ఒకటిన అతడిని ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు ఈ విషయాన్ని గుర్తించారని తెలిపారు. సహదేవ్ నుంచి సమాచారాన్ని సేకరించిన ఫోన్ నంబర్లు పాక్‌లో ఆపరేట్ అవుతున్నాయని ఫోరెన్సిక్ పరీక్షలో వెల్లడైందని చెప్పారు. అలాగే ఒక గుర్తుతెలియని వ్యక్తి నిందితుడికి రూ.40వేలు కూడా ఇచ్చారన్నారు. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 10 మందికిపైగా అరెస్టయిన సంగతి తెలిసిందే. వారిలో ఈ సహదేవ్ కూడా ఉన్నాడని ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు పాక్ నిఘావర్గాలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందన్నారు. వారి ఆర్థిక లావాదేవీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కూడా చేస్తున్నట్లు చెప్పారు.

## 'దానిని మైసూర్ పాక్ అనే పిలవండి'

## రాయల్ కుక్ మునిమనవడి తీవ్ర అభ్యంతరం




పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌పై యావత్ భారతీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ సమయంలో 'పాక్' పదాన్ని తీసేసి కొత్త పేర్లు పెడుతున్నారు. ఓ స్వీట్ల దుకాణం మైసూర్ పాక్‌ను 'మైసూర్ శ్రీ'గా మార్చేయడం నెట్టింట్లో వైరల్‌గా మారింది. దీనిపై రాయల్ కుక్ కకాసుర మడప్ప మునిమనవడు ఎస్.నటరాజ్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. మైసూర్ వడయార్ రాజకుటుంబానికి ఈ కకాసుర వంటవాడిగా ఉండేవారు. ఈ స్వీట్‌ను తొలుత తయారు చేసిన క్రెడిట్ ఆయనకే దక్కింది. తాజాగా పేరు మార్పుపై నటరాజ్ మాట్లాడుతూ.. "దానిని మైసూర్‌పాక్ అనే పిలవండి. మన పూర్వీకులు అందించిన ఆవిష్కరణకు ఇంకో పేరు ఉండదు. కన్నడలో 'Paaka' అంటే చక్కర లేదా బెల్లంతో చేసే పదార్థం అని అర్థం. దీనిని మైసూర్‌లో తొలుత తయారు చేయడం వల్ల మైసూర్‌పాక్ అని పేరు వచ్చింది. దీనిని వేరే పేరుతో పిలవడం అనవసరం. దీనికి వేరే అర్థాలు తీయొద్దు" అని కోరారు. రాజస్థాన్‌లోని జైపుర్‌లోని ప్రముఖ 'త్యోహార్ స్వీట్స్' యజమాని.. మైసూర్ పాక్‌తో పాటు మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ పేర్లను మార్చి.. మైసూర్ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీ అని కొత్త పేర్లు పెట్టారు. స్వర్ణ భాషం పాక్, చాందీ భాషమ్ పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా మార్చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికే ఆ దుకాణం యజమాని అంజలీ జైన్ మాట్లాడుతూ.. "దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే మేం ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. ఇక్కడ ఈ పదానికి పాకిస్థాన్‌తో సంబంధం లేకపోయినప్పటికీ.. దాన్ని పలికే శబ్దం ఆ దేశాన్ని గుర్తుచేసేలా ఉండటంతోనే పేరు మార్చినట్లు అంజలీ జైన్ తెలిపారు. 'శ్రీ' అనే పదం శుభానికి సూచికగా పెట్టినట్లు పేర్కొన్నారు.

## జ్యోతి మల్హోత్రాపై ప్రశ్నల వర్షం



పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా ఆమె గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. యూట్యూబ్ వీడియోల పేరుతో వివిధ ప్రాంతాలకు తిరుగుతూ భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు చేరవేస్తున్న జ్యోతి గతేడాది పూరీతో పాటు ఉజ్జయిని ప్రాంతానికి కూడా వెళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఏప్రిల్‌లో జ్యోతి ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయాన్ని సందర్శించినట్లు మధ్యప్రదేశ్ పోలీసులు పేర్కొన్నారు. అయితే విచారణలో ఎటువంటి నేరారోపణలు బయటపడలేదని..అక్కడ ఆమె ఏ ప్రాంతాలకు వెళ్లింది, ఎక్కడ బస చేసింది అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు 2024లో పూరీకి చెందిన మరో యూట్యూబర్‌తో శ్రీక్షేత్రాన్ని సందర్శించిన జ్యోతి ఆలయంపై డ్రోన్‌ను ఎగరవేసినట్లు అధికారులు గుర్తించారు. శ్రీక్షేత్రంపై ఉగ్రవాదుల కళ్లున్నాయని ఇటీవల కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలయంపైకి ఆమె డ్రోన్‌ను ఎందుకు పంపింది. అందులో ఏమి చిత్రీకరించింది అనే సమాచారాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో ఆమెకు పాక్ హైకమిషన్ ఉద్యోగి అయిన డానిష్‌తో పరిచయమైంది. అనంతరం ఆమె ఆ దేశ గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. పహల్గాం ఘటనకు ముందు ఆమె ఆ ప్రదేశాన్ని సందర్శించినట్లు పోలీసులు తెలిపారు.

# విజయవాడ రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్

విజయవాడ: విజయవాడ రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. అప్రమత్తమైన రైల్వే పోలీసులు బాంబు స్క్వాడ్ సాయంతో స్టేషన్ మొత్తం తనిఖీలు చేపట్టారు. అన్ని ప్లాట్‌ఫామ్‌లలోనూ విస్తృతంగా గాలించారు. ఎక్కడా అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫోన్ కాల్‌ను ట్రేస్ చేసిన సాంకేతిక సిబ్బంది దానిని ఫేక్ కాల్‌గా నిర్ధరించారు. మరోవైపు నగరంలోని బీసెంట్ రోడ్డులో ఉన్న ఎల్ఐసీ భవనానికి ఇవాళ బాంబు బెదిరింపు వచ్చిన సంగతి తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తి కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి బాంబు పెట్టినట్లు బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ బీసెంట్ రోడ్డులోని దుకాణాలను తనిఖీ చేశారు. అయితే, ఈ రెండు సందర్భాల్లోనూ ఫోన్ చేసింది ఒక్కరేనా? వేర్వేరు వ్యక్తులా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



*** ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు**

ముంబయి నుంచి విశాఖ వచ్చే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టామని ఫోన్‌కాల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో రైలును ఆపి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఎస్2 బోగీలో అనుమానిత బ్యాగ్‌ను గుర్తించారు.

## స్కార్పియో వాహనం ఢీకొని ఇద్దరు తెదేపా నేతలు మృతి

వెల్దుర్తి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బోదలవీడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెదేపా నేతలు మృతి చెందారు. గుండ్లపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా..స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఢీకొన్న స్కార్పియో వాహనం తెదేపా నేత వెంకట్రామయ్యదిగా గుర్తించారు. తెదేపాలోని రెండు వర్గాల మధ్య కొన్నాళ్లుగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. వెంకట్రామయ్య వర్గం ఇటీవలే వైకాపా నుంచి తెదేపాలోకి వచ్చింది.




ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి

కడప నేర వార్తలు: కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్దకు కారు రాగానే వెనుక వైపు నుంచి లారీ అతివేగంగా ఢీకొంది. ఆ వేగానికి లారీ కారుపై పడడంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కారుపై పడ్డ లారీని తీసేందుకు పోలీసులు



ప్రయత్నిస్తున్నారు. ఇంకా వాహనంలో ఎవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## యోగా దినోత్సవం విశాఖలో జరగనుండటం అదృష్టం.. : మంత్రి అనిత

విశాఖపట్నం: భారత్‌లో సంప్రదాయంగా వస్తున్న వ్యవస్థ యోగా అని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నాహకంలో భాగంగా విశాఖలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రలో మంత్రులు డీబీవీ స్వామి, అనిత పాల్గొన్నారు. విశాఖ బీచ్ రోడ్‌లో యోగాసనాలు వేశారు. అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. “11వ యోగా దినోత్సవం విశాఖలో నిర్వహించనుండటం అదృష్టం. రోజూ గంట



ఆసనాలు వేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటాం. వచ్చే నెల 21న విశాఖలో జరిగే యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతారు”అని మంత్రి అనిత తెలిపారు. ఆరోగ్యమే మనకు గొప్ప ఆస్తి అని మంత్రి డీబీవీ స్వామి అన్నారు. అందరిలో ఆరోగ్య భద్రత పెరిగిందని, ప్రస్తుతం పాత తరం ఆహారపు అలవాట్ల వైపు అడుగులు వేస్తున్నామని చెప్పారు. విశాఖలో జరిగే యోగా దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## విజయవాడలోని ఎల్ఐసీ భవనానికి బాంబు బెదిరింపు

విజయవాడ: నగరంలోని బీసెంట్ రోడ్డులో ఉన్న ఎల్ఐసీ భవనానికి బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తి కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి బాంబు పెట్టినట్లు బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ బీసెంట్ రోడ్డులోని దుకాణాలను తనిఖీ చేస్తున్నారు.



## ఇండస్ట్రీని అడ్డం పెట్టుకుని వివాదాలు సృష్టిస్తే సహించం..

*** మంత్రి హెచ్చరిక**

చిత్ర పరిశ్రమను అడ్డం పెట్టుకొని అనవసరంగా వివాదాలు సృష్టించేందుకు చేసే ప్రయత్నాలను సహించబోమని ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ వార్నింగ్ ఇచ్చారు. జూన్ 1వ నుంచి థియేటర్ల బంద్ నిర్ణయంపై హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. పరిశ్రమకు నష్టం వాటిల్లకుండా, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, ప్రొడ్యూసర్ల ప్రయోజనాలను కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య అనుకూల వాతావరణం ఉంది. టికెట్ రేట్లు, షూటింగ్ అనుమతుల విషయంలో ఇప్పటికీ అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాం. సినీ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కొత్త ఫిల్మ్ పాలసీ రూపకల్పన జరుపుతున్నట్లు తెలిపారు. సినిమా హాళ్లు బంద్ చేయాలని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయం వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకోవాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శికి కందుల దుర్గేష్ ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన ‘హరి హర వీరమల్లు’ సినిమా రిలీజ్‌కు ముందు థియేటర్లు బంద్ చేయాలని



తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్స్ నిర్ణయం తీసుకున్నారనే విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

## విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో విషాదం.. విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

విజయవాడ: నగరంలోని బెంజ్ సర్కిల్ సమీపంలో శనివారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. ఓ భవనంలో విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఒకరి పేరు ముత్యాలమ్మగా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు సేకరిస్తున్నారు. అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు



## మళ్లీ అదే తరహా ఘటన.. ఆందోళనలో వైసీపీ నాయకులు




గుంటూరు జిల్లా తాడేపల్లి లో వైఎస్సార్ సీపీ కార్యాలయం సమీపంలో అగ్నిప్రమాదం కలకలం రేగింది. అక్కడ ఉన్న గ్రీనరీకి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో వైసీపీ కార్యాలయం సిబ్బంది అలర్ట్ అయింది. ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపు చేశాయి. అయితే ఇదే తరహా ఘటనలు గతంలోనూ రెండు సార్లు జరిగాయి. ఇప్పుడు మళ్లీ జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదే పదే ఘటనలు పునరావృతం కావడంతో అటు వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పుడు సైతం వైసీపీ నేతలు చేసిన ఫిర్యాదును స్వీకరించారు. స్థానిక సీసీ టీవీ ఫుటేజులను పరిశీలిస్తున్నారు. అసలు అక్కడే ఎందుకు గ్రీనరికీ నిప్పు పెడుతున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## జైల్లో ఉన్న మాజీ ఐపీఎస్‌కు అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

ముంబై నటీ జెత్వానీ అక్రమ అరెస్ట్ కేసు, ఏపీపీఎస్సీ అవకతవకల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు పోలీసుల కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. గత కొద్ది రోజులుగా ఆయనను పోలీసులు విచారిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఆయన విజయవాడ జైలులో ఉన్నారు. అయితే శనివారం ఉదయం ఆంజనేయులు ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. బీపీలో హెచ్చుతగ్గులు రావడంతో ఆయన అస్వస్థతకు గురైనట్టు జైలు డాక్టర్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని సూచించడంతో విజయవాడ జైలు నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి పీఎస్ ఆర్ ఆంజనేయులును తరలించారు. ప్రస్తుతం ఆయనకు ఆస్పత్రిలో వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా పీఎస్ఆర్ ఆంజనేయులు ఆరోగ్యం పరిస్థితి క్షణించడంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎల్ఐసీ..

### 24 గంటల్లో 5,88,107 పాలసీలతో ప్రపంచ రికార్డు..!




**న్యూఢిల్లీ:** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకెక్కింది. 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలు జారీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది ఎల్ఐసీ. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సంవత్సరం జనవరి 24న దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఎల్ఐసీ ఏజెంట్లు కలిసి 24 గంటల్లో మొత్తం 5,88,107 జీవిత బీమా పాలసీలను జారీ చేశారని, ఇది ఓ ప్రపంచ రికార్డు అని జీవిత బీమా సంస్థ తెలిపింది. ఈ ఘనత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైని పేర్కొంది. ఇది ఘనత తమ ఏజెంట్ల అంకితభావం, నైపుణ్యం, అవిశ్రాంత కృషికి నిదర్శనమని ఎల్ఐసీ చెప్పుకొచ్చింది.

ఈ గొప్ప ప్రయత్నం కేవలం 24 గంటల్లోనే జీవిత బీమా పరిశ్రమలో కొత్త ప్రపంచ ప్రమాణాన్ని నెలకొల్పిందని.. ఈ విజయం మా కస్టమర్లకు, వారి కుటుంబాలకు కీలకమైన ఆర్థిక భద్రతను అందించే మా లక్ష్యం పట్ల తమ లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఈ రికార్డు కోసం ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ్ మొహంతి చొరవ చూపారు. ఈ ఏడాది జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే' రోజున ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీని పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మ్యాడ్ మిలియన్ డే'ని చారిత్రాత్మకంగా మార్చినందుకు కస్టమర్లు, ఏజెంట్లు, ఉద్యోగులకు మొహంతి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈపీఎఫ్‌పై వడ్డీ రేటును ప్రకటించిన కేంద్రం..




**న్యూఢిల్లీ:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ వడ్డీ రేటును కేంద్రం ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ ఖాతాలో డిపాజిట్లపై వడ్డీ రేటును 8.25శాతం వద్ద కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఫిబ్రవరి 28న జరిగిన సమావేశంలో వడ్డీ రేటును 8.25శాతం వద్దనే కొనసాగించాలని నిర్ణయించింది. అంతకుముందు 2023-24 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటును 0.10శాతం పెంచి 8.15శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

2022-23లో 0.05శాతం పెంచి 8.10శాతం నుంచి 8.15శాతానికి పెంచింది. 2022లో ఈపీఎఫ్‌వో ఏడుకోట్ల మందికిపైగా చందాదారుల కోసం 2021-22 సంవత్సరానికి ఈపీఎఫ్‌వో వడ్డీని నాలుగు దశాబ్దాలకుపైగా 8.1శాతానికి తగ్గించింది. ఈ వడ్డీ రేటు 2020-21లో 8.5 శాతంగా ఉంది. అంతకుముందు 2020-21 సంవత్సరానికి ఈపీఎఫ్‌పై 8.10 శాతం వడ్డీ రేటు ఉండగా.. 1977-78 తర్వాత ఇదే అత్యల్పం. ఆ సమయంలో ఈపీఎఫ్ వడ్డీ రేటు కేవలం ఎనిమిది శాతం మాత్రమే.

అయితే, ఈపీఎఫ్‌వో 2019-20కి ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీ రేటును ఏడు సంవత్సరాల కనిష్ట స్థాయి 8.5 శాతానికి తగ్గించింది. ఇది 2018-19లో 8.65 శాతంగా ఉన్నది. ఈపీఎఫ్‌వో చందాదారులకు 2016-17లో 8.65 శాతం వడ్డీ రేటును, 2017-18లో 8.55 శాతం వడ్డీ రేటును అందించింది. వడ్డీ రేటు కొంచెం ఎక్కువగా ఉంది. 2015-16లో 8.8 శాతం చెల్లించింది. రిటైర్మెంట్ ఫండ్ బాడీ 2013-14.. 2014-15లో 8.75 శాతం వడ్డీని ఇచ్చింది. ఇది 2012-13లో 8.5 శాతం కంటే ఎక్కువగా ఉంది. 2011-12 సంవత్సరంలో వడ్డీ రేటు 8.25 శాతంగా ఉన్నది.

## యాపిల్‌నేకాదు.. శాంసంగ్‌నూ టార్గెట్ చేసిన ట్రంప్



**న్యూయార్క్:** ప్రముఖ ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్‌కి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. అమెరికాలోనే ఫోన్లను తయారు చేయాలని చెప్పారు. లేదంటే 25శాతం సుంకాన్ని విధిస్తామంటూ తీవ్రంగా హెచ్చరించారు. అయితే, మరో దిగ్గజ మొబైల్ ఉత్పత్తుల సంస్థకు కూడా ట్రంప్ ఇదే తరహా హెచ్చరికలు చేశారు.

యాపిక్ ప్రత్యర్థి, దక్షిణ కొరియాకు చెందిన దిగ్గజ మొబైల్ సంస్థ శాంసంగ్ తమ ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలని స్పష్టం చేశారు. లేదంటే 25 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థకైనా ఈ టారిఫ్ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

'యాపిల్ ఒక్కటే కాదు.. శాంసంగ్ అయినా.. ఇంకే సంస్థ అయినా తమ ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలి. అలాకాకుండా ఇతర దేశాల్లో ఉత్పత్తి చేసినవి తీసుకొస్తే మాత్రం అది అన్యాయమైన ప్రక్రియ. అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థ అయినా.. ఇక్కడ ప్లాంట్ నిర్మిస్తే ఎలాంటి టారిఫ్‌లు ఉండవు. లేదంటే 25 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు.

దక్షిణ కొరియాకు చెందిన దిగ్గజ మొబైల్ సంస్థ శాంసంగ్.. అమెరికా మార్కెట్లో నంబరు 2 విక్రేతగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీ ఏటా 220 మిలియన్ ఫోన్లను విక్రయిస్తుండగా.. ఇందులో 60శాతం మొబైల్స్‌ను వియత్నాంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచే ఎక్కువగా అమెరికాకి ఎగుమతి అవుతున్నాయి. మరోవైపు కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం.. 2024లో భారత్‌లో తయారు చేసిన మొత్తం స్మార్ట్‌ఫోన్లలో యాపిల్, శాంసంగ్ 94 శాతం వాటా కలిగి ఉన్నాయి. 2025 మార్చి త్రైమాసికంలో భారత్‌లో శాంసంగ్ మార్కెట్ వాటా 17 శాతంగా ఉంది.

# పంజాబ్‌కు పంచ్ ఇచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్..



### విజయంతో సీజన్ నుంచి ఔట్..!

**జైపూర్:** ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో టాప్‌లోకి వెళ్లాలన్న పంజాబ్ కింగ్స్ ఆశలపై ఢిల్లీ క్యాపిటల్స్ నీళ్లు చల్లింది. ఈ టోర్నీలో ఇప్పటికే ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించిన ఢిల్లీ విజయంతో లీగ్‌ను ముగించింది. జైపూర్ వేదికగా జరిగిన మ్యాచులో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 207 పరుగుల లక్ష్యాన్ని మరో 3 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. సమీర్ రిజ్వీ 25 బంతుల్లో 58 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించాడు.

ఈ మ్యాచులో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఫస్టు బ్యాటింగ్ పంజాబ్ కింగ్స్‌కు అప్పగించింది. అయితే టాస్ ఓడి బ్యాటింగ్ చేసినా.. పంజాబ్ మాత్రం ఎదురుదాడికి దిగింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లే బ్యాట్ ఝుళిపించారు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (34 బంతుల్లో 53 రన్స్), మార్కస్ స్టోయినిస్ (16 బంతుల్లో 44 రన్స్ నాటౌట్), జోష్ ఇంగ్లిస్(12 బంతుల్లో 32 రన్స్) స్కోరు చేశారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో పంజాబ్.. 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ముస్తాఫిజుర్ రెహ్మాన్ 3, విప్రాజ్ నిగమ్ 2, కుల్‌దీప్ యాదవ్ 2, ముకేశ్ కుమార్ 1 వికెట్ తీశారు.

అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. కేఎల్ రాహుల్ (21 బంతుల్లో 35 రన్స్), ఫాఫ్ డుప్లెసిస్ (15 బంతుల్లో 23) రాణించారు. దీంతో పవర్ ప్లే ముగిసే సిరికి ఢిల్లీ 61/1తో నిలిచింది. ఆ తర్వాత ఓపెనర్లు ఇద్దరూ ఔట్ అయినా.. మిగతా బ్యాటర్ల తలో చేయి వేయడంతో ఢిల్లీ లక్ష్యం దిశగా సాగింది.

కరుణ్ నాయర్ (27 బంతుల్లో 44 రన్స్), అటల్ (16 బంతుల్లో 22 రన్స్), సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 58 రన్స్ నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (14 బంతుల్లో 18 రన్స్ నాటౌట్) కూడా రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ మరో 3 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో ఈ టోర్నీని విజయంతో ముగించింది. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇదే చివరి మ్యాచ్ కావడం గమనార్హం.



### ఇంగ్లాండ్ టూర్‌లో షమీకి దక్కని చోటు..

## అర్ష్‌దీప్‌కు పిలుపు..!

**న్యూఢిల్లీ:** అందరూ ఊహించిన విధంగా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ప్రకటించిన టీమిండియా జట్టులో చోటు దక్కలేదు. అతని స్థానంలో లెఫ్టార్మ్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. బీసీసీఐ శనివారం ఇంగ్లాండ్ పర్యటన కోసం 18 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో భారత్ ఐదు టెస్టులు ఆడుతుంది. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ ఇదే సిరీస్‌తో మొదలవనున్నది.

అర్ష్‌దీప్‌కు తొలిసారిగా టెస్ట్ జట్టులో చేరగా.. మహమ్మద్ షమీకి చోటు దక్కలేదు. షమీ చివరిసారిగా దాదాపు రెండేళ్లుగా టెస్టులు ఆడడం లేదు. చివరిసారిగా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున బరిలోకి దిగాడు. గాయం కారణంగా 14 నెలలు దూరమయ్యాడు. ఆ తర్వాత షమీ ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పేలవమైన ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. తొమ్మిది మ్యాచులు ఆడిన షమీ.. ఆరు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఈ క్రమంలో ఫిట్‌నెస్‌పై అనుమానాలు వ్యక్తమవయ్యాయి. ప్రస్తుతం టెస్టుల్లో సుదీర్ఘంగా




బౌలింగ్ చేయగలడా? అన్నది సందేహాస్పదంగా మారింది.

జట్టులో చోటు దక్కకపోవడానికి ఇదే కారణమని తెలుస్తున్నది. మరో వైపు అర్ష్‌దీప్ సింగ్ టీ20ల్లో బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. ఇంగ్లాండ్‌లో స్వింగ్‌ను సద్వినియోగం చేసుకొని రాణించే అవకాశాలున్నాయి. అర్ష్‌దీప్ సింగ్ 21 ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడాడు. 30.37 సగటుతో 66 వికెట్లు పడగొట్టాడు. రెండుసార్లు ఐదు వికెట్లు తీశాడు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌లో అర్ష్‌దీప్ 11 మ్యాచుల్లో 16 వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ ఇంగ్లాండ్‌లో కెంట్ తరఫున ఆడిన అనుభవం ఉంది. అయితే, మహ్మద్ షమీకి ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేయకపోవడం చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. షమీ సైతం ఫిట్‌గా లేడని, అందుకే అతన్ని ఎంపిక చేయలేదని తెలిపాడు.

### మలేషియా మాస్టర్స్

## ఫైనల్లోకి శ్రీకాంత్

**కౌలాలంపూర్:** ఇండియన్ స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించాడు. బీడబ్ల్యూఎఫ్ ఈవెంట్‌లో ఆరేళ్ల తర్వాత శ్రీకాంత్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఇవాళ జరిగిన సెమీస్ మ్యాచ్‌లో అతను వరుస గేమ్‌ల్లో విజయం సాధించాడు. జపాన్‌కు చెందిన యుషి తనకపై 21-18 , 24-22 స్కోరుతో నెగ్గాడు. 2019 తర్వాత శ్రీకాంత్.. తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఫైనల్లోకి ఎంట్రీఇచ్చాడు. గతంలో వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న 32 ఏళ్ల ఆ ప్లేయర్ మళ్లీ చాన్నాళ్ల తర్వాత టాప్ ఆటను కనబడిచాడు. ప్రస్తుతం అతను 65వ ర్యాంక్‌లో ఉన్నాడు. ఓ దశలో ఈ టోర్నీ కోసం అతను క్వాలిఫైయర్స్ ఆడాల్సి వచ్చింది.



వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడలిస్ట్ అయిన శ్రీకాంత్.. వరల్డ్ నెంబర్ 23 తనకపై వరుస గేమ్‌ల్లో థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశాడు. 2017లో అతను బీడబ్ల్యూఎఫ్ నాలుగు టైటిళ్లు గెలిచాడు. గత కొన్ని సీజన్ల నుంచి శ్రీకాంత్ తడబడ్డాడు. ఫామ్, ఫిట్‌నెస్ కోసం తీవ్రంగా శ్రమించాడు.

## టెస్టు రిటైర్మెంట్‌పై కోహ్లీ నాతో ఏప్రిల్‌లోనే మాట్లాడాడు : చీఫ్ సెలెక్టర్ అగార్కర్

**ముంబై:** దిగ్గజ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండా.. ఇంగ్లండ్ టూర్‌కు ఇండియన్ జట్టు రెఢీ అయ్యింది. ఆ ఇద్దరు మేటి బ్యాటర్లు ఇటీవల టెస్టలకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ టూర్ కోసం ఇవాళ 18 మంది సభ్యుల బృందాన్ని ప్రకటించిన సమయంలో.. భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ, రోహిత్ రిటైరయ్యారని, వాళ్ల స్థానాన్ని భర్తీ చేయడం కష్టమని అగార్కర్ పేర్కొన్నారు. అయితే ఇంగ్లండ్ టూరులో ఇతర ఆటగాళ్లు వారి పాత్రలను పోషిస్తారని ఆశిస్తున్నట్లు చీఫ్ సెలెక్టర్ తెలిపారు.




మే 7వ తేదీన రోహిత్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. మే 12వ తేదీన కోహ్లీ కూడా టెస్టులకు గుడ్‌బై చెప్పాడు. ఆ ఇద్దరూ క్రికెట్‌లో పెద్ద ప్లేయర్లు అని, అలాంటి ఆటగాళ్లు రిటైర్ అయితే, వాళ్ల స్థానాన్ని నింపడం కష్టమైన పని అని, కానీ ఇతరులు దాన్ని అవకాశంగా మలుచుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆ ఇద్దరు సూపర్‌స్టార్ల స్థానంలో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సాయి సుదర్శన్, మరో బ్యాటర్ కరుణ్ నాయర్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

గత నెలలోనే కోహ్లీ టెస్టు రిటైర్మెంట్ గురించి తనతో సంప్రదించినట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించారు. చాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతను తన టెస్టు క్రికెట్ గురించి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. బీసీసీఐ సెలెక్షన్ కమిటీని అతను ఆశ్రయించాడని, ఎంత ఆడాలో అంత ఆడినట్లు చెప్పాడని, ప్రమాణాలకు తగినట్లు ఆడలేనని భావిస్తున్న క్షణంలో ఆ నిర్ణయాన్ని గౌరవించాల్సి ఉంటుందన్నాడు.

ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కోహ్లీ పెర్త్ టెస్టులో సెంచరీ చేశాడు. కానీ అయిదు టెస్టుల సిరీస్‌లో అతను కేవలం 190 రన్స్ మాత్రమే చేశాడు. ఆ సిరీస్‌లో అతని బ్యాటింగ్ సగటు 23గా ఉంది. తొలి టెస్టు తర్వాత జట్టుతో చేరిన రోహిత్ కూడా ఎక్కువ ప్రభావం చూపలేకపోయాడు. ఆ సిరీస్‌లో అతను 6.2 సగటుతో కేవలం 31 రన్స్ మాత్రమే చేశాడు. సిడ్నీ టెస్టులో అతను ఆడలేదు. ఆ సిరీస్ పర్ఫార్మెన్స్ ఆధారంగా వాళ్ల రిటైర్మెంట్ అంశంపై పునరాలోచన చేయలేకపోయినట్లు అగార్కర్ తెలిపాడు. అయితే 2025-27 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ బ్యాటర్లను ఎంపిక చేయాల్సి వచ్చిందన్నాడు.

ఆటగాళ్లు ఎవరైనా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకుంటే, అది తనకు సంబంధం లేనిదని, రిటైర్మెంట్ అనేది వ్యక్తిగతమైన నిర్ణయమని, కొత్త డబ్ల్యూటీసీ సైకిల్ ప్రారంభమైందని, మళ్లీ జట్టును నిర్మించే పనిలో పడినట్లు అగార్కర్ తెలిపారు. ఫేర్‌వెల్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాలని కోహ్లీ భావించినట్లు ఊహాగానాలు వినిపించాయి. నిజానికి కోహ్లీయే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# తెలుగు చిత్ర పరిశ్రమపై పవన్‌కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు



టాకీస్: ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ తెలుగు చిత్ర పరిశ్రమపై సంచలన వ్యాఖ్యలు చేశారు. . ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా సినిమా సంఘాల ప్రతినిధులు సీఎంను కలిశారా ? సినీ పెద్దలు, అగ్రనటులను వైసీపీ ప్రభుత్వం ఎలా చూసిందో, ఎన్ని ఇబ్బందులు పెట్టిందో మరిచిపోయారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మా అసోసియేషన్ మరిచినట్లున్నాయని ఎద్దేవా చేశారు. ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని అన్నారు. తెలుగు చిత్రసీమ ఇచ్చిన రిటర్న్ గిఫ్టనకు కృతజ్ఞతలు అంటూ పవన్ కల్యాణ్ కార్యాలయం శనివారం సాయంత్రం ప్రకటనను విడుదల చేసింది తమ ప్రభుత్వం వ్యక్తులను కాదు. సినీరంగం అభివృద్ధినే చూస్తుందని వెల్లడించారు.

అందరూ కలిసి రావాలన్న సూచనలకు సానుకూలంగా స్పందించలేదని ఆరోపించారు. ఏపీలో రూ. కోట్ల పెట్టుబడులతో నిర్మించే చిత్రాలను ప్రోత్సాహిస్తామని చెప్పాం. సృజనాత్మక వ్యాపారంలో ఉన్నవారి గౌరవానికి భంగం వాటిల్లకూడదని చెప్పామని , కొన్ని సినిమాల విడుదలకు ముందు టికెట్ల ధరను పెంచామని గుర్తు చేశారు.

కాగా పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు విడుదలకు ముందు తమ డిమాండ్ల సాధనకు సినిమా థియేటర్లను మూసివేస్తామని ఎగ్జిబ్యూటర్లు నిర్మాతలను హెచ్చరించిన మేరకు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి.

# అనుకున్నంత సైలెంట్ కాదు..
## ప్రభాస్‌పై మాళవిక మోహనన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



టాకీస్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌పై యువ నటి మాళవిక మోహన న్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బయట కనిపించే ప్రభాస్ ఇమేజ్‌కు భిన్నంగా ఆయన వ్యక్తిత్వం ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజా సాబ్' చిత్రంలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అనుభవాలను పంచుకుంటూ, ప్రభాస్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.మాళవిక మోహనన్ ఇటీవల సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ, ప్రభాస్‌తో తన అనుభవాలను పంచుకున్నారు. "నేను ప్రభాస్ సార్‌ను కలవడానికి ముందు ఆయన ఇంటర్వ్యూలు చూసినప్పుడు చాలా సైలెంట్‌గా, రిజర్వ్‌డ్‌గా ఉంటారని అనుకున్నాను. కానీ ఆయనను స్వయంగా కలిసినప్పుడు మంచి మాటకారి, సూపర్ ఫన్, ఫన్నీ అని అర్థమైంది" అని మాళవిక తెలిపారు. ప్రభాస్‌తో సమయం గడపడానికి చాలా చక్కని వ్యక్తులలో ఒకరని, ఆయన చుట్టూ ఎప్పుడూ బోరింగ్ క్షణమే ఉండదని ఆమె ప్రశంసించారు.

ప్రభాస్ తన సహనటులను సెట్‌లో ఆహారంతో ఆకట్టుకుంటారని, ఒక గ్రామానికి సరిపడా రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేస్తారని మాళవిక మోహనన్ గతంలోనూ వెల్లడించారు. ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఏడి' సినిమా విజయం తర్వాత కూడా ప్రభాస్ చాలా సింపుల్‌గా, డౌన్ టు ఎర్త్ గా ఉన్నారని ఆమె కొనియాడారు. మాళవిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రభాస్ అభిమానులను మరింత సంతోషపరుస్తున్నాయి. 'ది రాజా సాబ్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్, మాళవిక మోహనన్‌ల కాంబినేషన్ ఈ సినిమాకు మరింత ఆకర్షణగా మారింది.




# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో అలియా భట్ సందడి




టాకీస్: ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో అందాల ముద్దుగుమ్మలు తెగ సందడి చేస్తున్నారు. వెరైటీ డ్రెస్సులలో వచ్చి కనువిందు చేస్తున్నారు. ఈసారి కూడా భారత్ నుంచి మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. మొదటి రోజున రెడ్ కార్పెట్‌పై చీరలో ఈ భామ తళుక్కుమన్నారు. తాజాగా మరో బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కూడా కేన్స్‌లో సందడి చేశారు.

తొలి రోజే ఆమె హాజరు కావల్సి ఉన్న భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. ఎట్టకేలకు వేడుక ముగిసే సమయానికి అలియా భట్ కేన్స్ లో మెరిసి తమ అభిమానుల్లో ఆనందాన్ని నింపారు. తొలిసారి కేన్స్‌లో అడుగుపెట్టిన అలియా సింపుల్ ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన ఫ్లోరల్ గౌన్ ధరించి నాజూగ్గా కనిపించారు. కేన్స్‌కి వెళ్లక ముందే తన స్టన్నింగ్ లుక్‌కి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'హలో కేన్స్' అనే క్యాప్షన్‌తో అభిమానులతో పంచుకున్న ఈ ఫొటోల్లో కొంటె చూపుల్తోనే కాల్చి చంపేలా ఉన్నారు. ప్రస్తుతం ఈ అమ్మడి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే, మే 13 నుంచి 24 వరకు కేన్స్ ఫెస్టివల్ జరగనుండగా, చివరి క్షణాలలో వచ్చి అలియా అలరించారు. ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇస్తూ వేడుక ముగిసే సమయానికి వేదికపై మెరిశారు. దీంతో అంతర్జాతీయ వేదికగా మెరిసిన తారల జాబితాలో అలియా భట్ చేరడం ఆనందంగా ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

## వరుణ్ తేజ్-మేర్లపాక గాంధీ ప్రాజెక్ట్
# తొలి షెడ్యూల్ పూర్తి!




టాకీస్: మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హారర్-కామెడీ సినిమా నుంచి తాజా అప్‌డేట్ వచ్చింది. 'కొరియన్ కనకరాజు' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తొలి షెడ్యూల్ అనంతపురంలో విజయవంతంగా పూర్తయినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అనంతపురంలో జరిగిన ఈ షెడ్యూల్‌లో చిత్రబృందం ఒక అద్భుతమైన పాటను చిత్రీకరించింది. అంతేకాకుండా, ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఆసక్తికరమైన సన్నివేశాలను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ పూర్తైనట్లు ప్రకటించడానికి మేకర్స్ వరుణ్ తేజ్ ఉన్న ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఈ జూన్‌లో కొరియాలో ప్రారంభం కానుందని సమాచారం. ఇది ఒక ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ కావడంతో, కొరియాలో చిత్రీకరణ కీలకమైన భాగంగా ఉంది. ఈ చిత్రంలో రితిక నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామ్యంతో, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సహకారంతో ఈ సినిమా నిర్మితమవుతోంది. అధిక బడ్జెట్‌తో, భారీ స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

# జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ లేదు
## కావాలనే కొందరు తప్పుడు ప్రచారం

టాకీస్: జూన్ 1వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల్లోసినిమా థియేటర్ల బంద్ ఏమీ లేదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. థియేటర్లకు కూడా పర్సంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో శనివారం ఫిల్మ్ ఛాంబర్‌లో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశానికి సంబంధించిన వివరాలను ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ వెల్లడించారు. థియేటర్ల బంద్ అనేది తప్పుగా చిత్రీకరించారు. చర్చలు జరగకపోతే, జూన్ 1వ తేదీ నుంచి అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నది మాత్రమే నిజం. కానీ, అందరూ థియేటర్లు మూసి వేస్తారన్న



సమాచారాన్నే ప్రచారం చేశారు. ప్రస్తుతం అలాంటిదేమీ లేదు. కేవలం ఒక్క సినిమాను దృష్టిలో పెట్టుకుని థియేటర్‌లను బంద్ చేస్తున్నామనడం సరికాదు. కొన్ని వార్తలు బిజినెస్‌ను దెబ్బతీస్తాయి. చిత్ర పరిశ్రమలో వంద సమస్యలు ఉన్నాయి. అన్నీ ఒకదానితో ఒకటి కనెక్ట్ అయి ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటీ పరిష్కరించుకుంటూ రావాలి. థియేటర్ల పర్సంటేజీ విషయమై కొన్నేళ్లుగా ఎలాంటి చర్చ జరగలేదు. ప్రస్తుతం జరుగుతోంది. తర్వాత రోడ్ మ్యాప్ ఏంటనేది నిర్ణయిస్తాం. మూడు సెక్టార్ల నుంచి కమిటీ- వేస్తున్నాం. నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరించుకుంటాం. ఈనెల 30న జరిగే సమావేశంలో కమిటీ ఎవరనేది నిర్ణయిస్తాం అని వివరించారు.

# బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూత
## సంతాపం తెలిపిన జూనియర్ ఎన్టీఆర్ తదితరులు



టాకీస్: బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ (54) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఆయన ముంబయిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారని కుటుంబసభ్యులు, సన్నిహితులు ఈ విషయాన్ని తెలియజేశారు. ముకుల్ దేవ్ మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందంటూ సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ముకుల్ దేవ్‌తో ఉన్న అనుబంధాన్ని టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ గుర్తుచేసుకున్నారు. ముకుల్ మరణించడం బాధాకరం. 'అదుర్స్'లో ఆయనతోపాటు వర్క్ చేసినప్పుడు ఆయన నిబద్ధత తెలిసింది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా అని ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. ముకుల్‌ను గుర్తుచేసుకుంటూ బాలీవుడ్ ప్రముఖులు పోస్టులు పెడుతున్నారు. ఆయన ఇక లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నట్లు- మనోజ్ బాజ్‌పాయ్ విచారం వ్యక్తం చేశారు. గొప్ప కళాకారుడని.. కాలం ఆయన్ని త్వరగా తీసుకెళ్లిపోయిందన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.